విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 23, మే 2024

కారుబోల్తా పడి మున్సిపల్ వైస్ చైర్మన్‌కు గాయాలు

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం : వైసీపీ నాయకుడు, కళ్యాణదుర్గం మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణీంద్రకు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం తెల్లవారుజామున సత్యసాయి జిల్లా ముదిగుబ్బ సమీపంలో ఫణీంద్ర ప్రయాణిస్తున్న కారు బోల్తా పడింది.. డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ప్రమాదం జరిగినట్లు తెలిసింది. సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వివరించడానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో వస్తుండగా జయం ఫణీంద్ర ప్రమాదానికి గురయ్యారు. ఘటన జరిగిన వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. 108 సాయంతో తీవ్ర గాయాలతో ఉన్న ఆయన్ను అనంతపురం తీసుకొచ్చారు. ఇక్కడ ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఫణీంద్రకు ప్రాణాపాయం లేదని బెంగళూరులో చికిత్స తీసుకుంటున్నట్లు సోదరుడు జయం విశ్వనాథ్ మీడియాకు తెలిపారు. సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి ఉషశ్రీ చరణ్ బెంగళూరు వెళుతున్న ఫణీంద్రను పెనుగొండలో అంబులెన్స్ ఆపి పరామర్శించారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సురేంద్రబాబు, వైసీపీ అభ్యర్థి రంగయ్యలు కుటుంబ సభ్యుల ద్వారా యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

వరుణుడి ఆగమనం.. రైతుల్లో ఆనందం

-ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతన్న

విశాలాంధ్ర-రాప్తాడు: వరుణ దేవుడు కరుణించడంతో నియోజకవర్గంలో మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతన్నలు ఖరీఫ్ సీజనులో పంటలు సాగు చేసేందుకు ముంగారు సేద్యాలకు సన్నద్ధమవుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఖరీఫ్‌లో దాదాపు సాధారణ సాగు విస్తీర్ణం 36వేల హెక్టార్లు ఉండగా రైతులు ఏటా సరాసరి 25వేల హెక్టార్లకుపైగా పంటలు సాగు చేస్తున్నారు. జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నందున... సరైన సమయంలో వర్షాలు కురిస్తే విత్తనం వేసేందుకు రైతులు సిద్ధం కానున్నారు. ఆశించిన స్థాయిలో వర్షాలు పడితే ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

వ్యవసాయ యంత్రాలకు డిమాండ్.. నియోజకవర్గంలో ఖరీఫ్ సీజనుకు ముందే పలు ప్రాంతాల్లో వర్షాలు పడడంతో ముందస్తు సేద్యానికి డిమాండ్ పెరిగింది. రైతులకు కాడెద్దులు లేకపోవడంతో ట్రాక్టర్ల ద్వారా టిల్లర్లతో పొలాల్లో దుక్కులు దున్నుకునేందుకు సమాయత్తం అవుతున్నారు. ట్రాక్టర్లతో దుక్కి చేసేందుకు గంటకు రూ.1000 నుంచి రూ.1300, వరకు బాడుగలు నడుస్తున్నాయి.

వేసవి దుక్కులతో ప్రయోజనాలు అనంతం

-వ్యవసాయ అధికారి శేఖర్ రెడ్డి..

వేసవి దుక్కుల వల్ల కలిగే ప్రయోజనాలను వ్యవసాయ అధికారి శేఖర్‌రెడ్డి వివరించారు. భూమిని 15-30 సెం.మీ లోతు దున్నడం వలన వర్షపు నీరు భూమిలోకి ఇంకుతుంది... వాలుకు అడ్డంగా దుక్కులు దున్నడం వల్ల భూమి కోతకు గురికాకుండా ఉంటుందని తెలిపారు. అలాగే భూమి పైపొరలు కిం దకు, కింది పొరలు పైకి తిరగబడి నేల సారవంతం అవుతుందన్నారు. నేలలో ఉండే మొండి జాతి కలుపు మొక్కల దుంపలతో పెకిలించేలా లోతు దుక్కి దున్నడం వల్ల కలుపు బెడద ఉండదు. భూమిలో నిద్రావస్థలో ఉన్న పలు కీటకాల కోశస్థ దశలు నశింపబడి తదుపరి పంటల మీద చీడపీడల ఉధృతి తగ్గించవచ్చని వివరించారు. తొలకరిలో దున్నడం వల్ల నేలలోకి నీరు బాగా ఇంకి తరువాత వేసే పంటలకు ఉపయోగపడుతుంది. అంతేకాక మొక్కల వేర్లు లోనికి పోయి తేమను, పోషకాలను ఎక్కువ శాతం అందుకుని దిగుబడితో పాటు పంట నాణ్యత పెరుగుతుంది. వేసవిలో పొలాలను సేద్యం చేయడం వల్ల గత పంటకు చెందిన ఆకులు, చెత్త నేలలో కలిసిపోయి సేంద్రియ పదార్థంగా మారతాయి. ఎండు తెగులు ఉన్న ప్రాంతాల్లో వేసవి దుక్కులు చేస్తే భూమిలోని శిలీంద్రాలు నశించి తర్వాత పంట కాలానికి ఈ తెగులు తీవ్రత చాలా వరకు తగ్గుతుంది. ముందుగానే దుక్కి సిద్ధం చేయడం వల్ల వర్షాలు కురవగానే వానాకాలం పంటలను అదనులో వేసుకోవచ్చు.

పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలి..

పంటవేసే ముందు భూసార పరీక్షలు చేయించుకుంటే రైతాంగానికి కలిగే అదనపు ఖర్చు తగ్గించుకోవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఈ పరీక్షకు ముందు మట్టి నమూనాలు సరైన పద్ధతిలో తీసుకుంటే ప్రయోజనం ఉంటుందని చెబు తున్నారు. తద్వారా ఎలాంటి విత్తనాలు తీసుకోవాలి. ఎంత మోతాదులో ఎంత ఎరువు వాడాలనే విషయాలు భూసార పరీక్షల ద్వారా తెలుసుకోవచ్చు.

ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష పక్కాగా నిర్వహించాలి

- 24వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు పరీక్షలు
- కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలి
- జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్...

విశాలాంధ్ర-అనంతపురం : ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారు లను ఆదేశించారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఇంటర్మీడి యట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు, మే - 2024పై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని, ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సరం పరీక్షలు, మధ్యాహ్నం 02:30 గంటల నుంచి 05:30 గంటల వరకు రెండవ సంవత్సరం పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లాలో 170 జూనియర్ కళాశాలలు ఉండగా, 18 జోన్లలో, 22 స్టోరేజ్ పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. 34 కళాశాలల్లో థియరీ ఎగ్జామినేషన్ సెంటర్లను ఏర్పాటు చేయగా మొదటి సంవత్సరం సంబంధించి 15,921 మంది జనరల్ విద్యార్థులు, 980 మంది ఒకేషనల్ విద్యార్థులు కలిపి మొత్తం 16,901 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. రెండవ సంవత్సరం సంబంధించి 5,017 మంది జనరల్ విద్యార్థులు, 592 మంది ఒకేషనల్ విద్యార్థులు కలిపి మొత్తం 5,609 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. మొదటి, రెండవ సంవత్సరం కలిపి మొత్తం 22,510 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్ మిషన్లను మూసి వేయించాలన్నారు. అన్నిచోట్ల ఫస్ట్ ఎయిడ్ కిట్లను ఏర్పాటు చేయాలని, ఒత్తిడిలో ఉన్న విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని, సైకలాజికల్ కౌన్సిలింగ్ అందించాలన్నారు. పరీక్షలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్ రెడ్డి, డివిఈవో వెంకటరమణ నాయక్, డీఈవో వరలక్ష్మి, ఇన్‌చార్జి డిఎంహెచ్ఓ డా.సుజాత, కలెక్టరేట్ ఏవో అంజన్ బాబు, లేబర్ డీసీ లక్ష్మీ నరసయ్య, ఏపీఎస్ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ మేనేజర్ రమేష్ బాబు, ఏపీఎస్పీడీసీఎల్ ఏడి వివేకానంద స్వామి, జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ మెంబర్లు మహమ్మద్ రఫీ, జగన్నాథ్ పాల్గొన్నారు.

సింహ, చంద్రప్రభ వాహనంపై విహరించిన నరసింహ స్వామి

పెన్నహొబిలంలో ఘనంగా నృసింహ జయంతి

విశాలాంధ్ర-ఉరవకొండ : పెన్నహొబిలం శ్రీలక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం నృసింహ జయంతి సందర్భంగా తెల్లవారుజాము నుంచే స్వామివారి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వివిధ రకాల పూలతో స్వామివారిని అందంగా అలంకరించారు. మహా మంగళహారతి ఇచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు ఉదయం స్వామివారు సింహ వాహనంపై విహరించారు. ఉభయ దాతలుగా కళ్యాణదుర్గం టిడిపి పార్టీ అభ్యర్థి, మరియు ఎస్సార్ కన్స్ట్రక్షన్ అధినేత అమిలినేని సురేంద్ర బాబు కుటుంబ సభ్యులు పాల్గొని నిర్వహించారు. దుష్టజన శిక్షణకు, శిష్టజన రక్షణకు సంకేతం సింహ వాహనం, జగన్నాయకుడి అవతారాల్లో నాలుగోది నృసింహ అవతారం. సింహ బలమంత భక్తిభావం ఉన్నవారికి స్వామి అనుగ్రహం లభిస్తుందని నమ్ముతారు. శౌర్య ప్రతాపాలకు ప్రతీకగా నిలిచే సింహాన్ని తన వాహనంగా మలచుకుని శ్రీదేవి భూదేవి సమేతంగా మాడవీధుల్లో స్వామివారు విహరించారు. సింహ వాహనంపై దర్శనమిచ్చిన స్వామివారిని చూసి భక్తులు పులకించిపోయారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ విజయ్‌కుమార్, అర్చకులు ద్వారక నాథ్, మయూరం బాలాజీ, గుండు రావు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం చంద్రప్రభ వాహనంపై స్వామివార్లు విహరించారు.

ఎస్సార్ కన్‌స్ట్రక్షన్ అధినేత అన్నదానం

విశాలాంధ్ర-ఉరవకొండ : పెన్నహొబిలం నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు సందర్భంగా బుధవారం ఎస్సార్ కన్స్ట్రక్షన్ అధినేత కళ్యాణదుర్గం టిడిపి పార్టీ అభ్యర్థి అమ్మిలినేని సురేంద్ర కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అంతేకాకుండా బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు సింహ వాహనంపై ఊరేగిన కార్యక్రమానికి సంబంధించి ఉభయ దాతలుగా కూడా సురేంద్ర కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పోలీసింగ్‌పై ఎస్పీ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-అనంతపురం : జెఎన్టీయులోని స్ట్రాంగు రూంల భద్రత, డయల్-100 విభాగం పోలీసుల పనితీరు, స్పందన అర్ధరాత్రి వేళ ఎలా ఉందోనని బుధవారం ఎస్పీ గౌతమిశాలి అర్ధరాత్రి 2 గంటల సమయంలో తనిఖీలు నిర్వహించారు. స్ట్రాంగు రూంల వద్ద మూడంచెల భద్రతను పరిశీలించారు. అనంతరం జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లోని ఈసర్వేలెన్స్ సెంటర్లో నిర్వహిస్తున్న డయల్-100 విభాగాన్ని తనిఖీ చేశారు. అర్ధరాత్రి వేళ పోలీసుల సహాయం కోసం ప్రజలు/బాధితుల నుండీ వచ్చే ఫోన్ కాల్స్‌కు ఎలా రెస్పాండ్ అయ్యి సంబంధిత పోలీసులను ఘటనా స్థలాలకు ఎలా పురమాయిస్తున్నారో సమీక్షించారు. జెఎన్టీయు స్ట్రాంగు రూంల వద్ద భద్రతా విధుల్లో ఉన్న సాయుధ పోలీసులు... డయల్ - 100 విభాగం పోలీసులు అప్రమత్తంగా ఉన్నట్లు ఎస్పీ తనిఖీల్లో తేలింది. మరింత అప్రమత్తంగా ఉండాలని... చిత్తశుద్ధి, అంకితభావంతో విధులు చేపట్టి ప్రజల్లో విశ్వాసం పెరిగేలా పని చేయాలని సూచించారు.

వేరుశనగ విత్తన నమోదు ప్రక్రియ పరిశీలన....

విశాలాంధ్ర-ఉరవకొండ : మండలంలోని షేక్షాన్ పల్లి, లత్తవరం గ్రామాలలో రైతు భరోసా కేంద్రాలను బుధవారం మండల వ్యవసాయ అధికారి శుభకర్ సందర్శించారు. ఖరీఫ్ వేరుశనగ విత్తన నమోదు ప్రక్రియను పరిశీలించారు. రైతులకు కొన్ని సూచనలు అందించారు విత్తన వేరుశనగ పంపిణీ ఈనెల 24 నుంచి అన్ని రైతు భరోసా కేంద్రాలలో ప్రారంభమవుతుందని తెలిపారు. వేరుశనగ విత్తనాన్ని విత్తన శుద్ధి చేసిన తరువాతనే విత్తుకోవాలన్నారు. తద్వారా తెగుళ్లను అరికట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతు భరోసా సిబ్బంది చిక్కన్న, గోపాల్ నాయక్ పాల్గొన్నారు.

90 శాతం సబ్సిడీతో విత్తనాలు అందించాలి

రైతు భరోసా కేంద్రాల ద్వారా సరిపడినన్ని విత్తనాలు, ఎరువులను అందించాలి

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నప్పయాదవ్, సీపీఐ నాయకులు

విశాలాంధ్ర- అనంతపురం బ్యూరో : 90 శాతం సబ్సిడీతో రైతులు అవసరమైన విత్తనాలను అందించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నప్ప యాదవ్, నార్పల మండల సీపీఐ కార్యదర్శి గంగాధర్, మండల రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నార్పల మండల కేంద్రంలోని 3వ రైతు భరోసా కేంద్రంలోని వేరుశనగకాయలను పరిశీలించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చిన్నప్పయాదవ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రైతు భరోసా కేంద్రాలలో వేరుశనగ బస్తాల కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ గత 18వ తారీకు నుంచి మొదలైంది .. అయితే వేరుశెనగ కాయలు కె.6 పేరుతో చాలామంది రైతులకు అందుబాటులో తెచ్చామని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు కానీ ఆ వేరుశనగ కాయలు నాసి రకంగా ఉన్నాయని పేర్కొన్నారు. తక్షణమే రైతులకు మేలు రకమైన విత్తనాలు అందిం చాలన్నారు. రైతులకు ఒక బస్తా నుంచి మూడు బస్తాల వరకే ఎన్ని ఎకరాలు ఉన్నా అన్నే.. ఇస్తామని చెప్పడం జరుగుతున్నది కానీ గతం నుంచి ఏపీ రైతుసంఘం ద్వారా డిమాండ్ చేస్తున్నాం.. ఈరోజు రైతులకు ప్రభుత్వం మూడు బస్తాలు కేవలం ఒక ఎకరాకు సరిపడే వేరుశనగ విత్తనాలు మాత్రం ఇస్తున్నారు మిగతా ఎకరాలకు అవసరమైన విత్తనాలను ప్రైవేటు వ్యక్తుల ద్వారా అధిక ధరలతో కొనుగోలు చేస్తున్నందువల్ల రైతులు అప్పుల పాలవుతున్నారని పేర్కొన్నారు. కావున రైతులకు జిల్లా వ్యాప్తంగా వేరుశెనగ, పత్తి, కంది, ఆముదం, మొక్కజొన్నతో పాటు అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉంచాలని కోరారు. ఎరువులు పురుగు మందులను కూడా 90 శాతం సబ్సిడీతో అందించాలన్నారు. నకిలీ మందులను అరికట్టి షాప్ యజమానుల పైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, కరువులు, వరదలు, తెగుళ్ళు నిత్యకృత్యమైందని, ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. అందుకే రైతులకు మేలు చేసేవిధంగా సమగ్ర పంటల బీమా పథకం అమలు చేయాలన్నారు. రైతులకు, కౌలు రైతులకు సరిపడు నాణ్యమైన అన్నిరకాల కల్తీ లేని విత్తనాలు, ఎరువులు పురుగుమంధులు, రైతుభరోసా కేంద్రాల ద్వారా అందించాలని కోరారు. పంటలను గిట్టుబాటు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో, రైతు సంఘం మండల కార్యదర్శి లలితమ్మ, సీపీఐ మండల సహాయ కార్యదర్శి రమేష్, వ్య.కా.సం మండల కార్యదర్శి పెద్దపెద్దయ్య, నాయకులు సుధాకర, నాగరాజు, నారాయణప్ప, సంజీవ రాయుడు, జయలక్ష్మి, కుల్లాయప్ప, మాబు, మల్లికార్జున పాల్గొన్నారు.

మేలు రకమైన విత్తనాలివ్వాలి

ఏపి కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సనప నీళపాల రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం : రైతు భరోసా కేంద్రాలలో 90శాతం సబ్సిడీతో వేరు శనగ విత్తనాలు అందించాలని ఏపీకౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సనప నీళ్ల పాల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈఏపి కౌలు రైతు సంఘం(సీపీఐ) ఆధ్వర్యంలో ఆత్మకూరు మండలం సనప గ్రామ రైతుభరోసా కేంద్రంలోని వేరు శనగకాయలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రైతులకు కౌలు రైతులకు 81,832 క్వింటాళ్ళు కేటాయించిన వాటిలో వేరుశనగ 76,710 క్వింటాళ్ళు విత్తనాలు 40 శాతంతో వేరుశనగ బస్తాలు కేటాయించడం జరిగింది. రైతు భరోసా కేంద్రాలను వేరుశనగ బస్తాల కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ గత 18వ తేదీ నుంచి మొదలైందని అంటున్నారు.. కానీ వేరుశెనగ కాయలు కె.6 పేరుతో చాలామంది రైతులకు అందుబాటులో తెచ్చామని వ్యవసాయ అధికారులు చెబుతున్నారని, అయితే మేలు రకమైన విత్తనాలు అందించాలని కోరారు. రైతులకు సరిపడి అన్ని రకాల విత్తనాలు కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి బి,రామాంజినేయులు పాల్గొన్నారు.

రెవిన్యూ అధికారుల నిర్లక్ష్యంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

- శాఖా పరమైన చర్యలు తీసుకోవాలి..
- సీపీఐ నేతల డిమాండ్

విశాలాంధ్ర-ఉరవకొండ: విడపనకల్లు మండలం తహసిల్దార్ కార్యాలయంలో కొంత మంది రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని దీనివల్ల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అలాంటి అధికారుల పట్ల శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ పార్టీ ఉరవకొండ నియోజకవర్గ నాయకులు చెన్న రాయుడు కలెక్టర్ వినోద్‌కుమార్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. బుధవారం విడపనకల్లు తాసిల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెన్నరాయుడు జిల్లా కలెక్టర్‌ని కలిసి మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఎంఆర్ఓ కార్యాలయంలో రైతులకు, విద్యార్థులకు పనులు జరగడం లేదని రైతులకు బ్యాంకులలో వ్యవసాయ రుణాలను తీసుకోవడం, రెన్యువల్ చేయడం జరుగుతుందని దీనికి సంబంధించి వన్ బి అడంగల్ బాండ్లు సరిగా రావడం లేదని రీ సర్వే అయిన తర్వాత భూమి ఎక్కువ తక్కువ వస్తుంది దీనిపైన మండల అధికారులు చొరవ తీసుకుని వాటిని పరిష్కరించడంలో పూర్తిగా విఫలమ య్యారని తెలిపారు. దీనివల్ల రైతులు రోజు కార్యాల యాలు చుట్టూ తిరుగుతూ ఇబ్బందులకు గురవుతున్నా రని పేర్కొన్నారు. విద్యార్థుల చదువులకు సంబంధించి కులం మరియు ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మంజూరులో కూడా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దీనివల్ల విద్యార్థులు ఇబ్బంది లకు గురవుతున్నారని తెలిపారు. విడపనకల్లు తాహసిల్దార్ కార్యాలయంలో అధికారుల నిర్లక్ష్యంపై అనేక పత్రికల్లో వార్తలు వచ్చినా మార్పు రాలేదన్నారు. భవిష్యత్తులో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా కార్యాలయంలో పనులు జరిగే విధంగా చూడాలని కోరారు.

ఎన్నికలు ముగిసే వరకు శాంతిభద్రతలను కాపాడాలి

- వేల్పుమడుగులో సుంకులమ్మ జాతరను ప్రశాంతంగా నిర్వహించాలి
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వినోద్‌కుమార్

జాతరపై గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

విశాలాంధ్ర-అనంతపురం బ్యూరో: సాధారణ ఎన్నికలు ముగిసేవరకు శాంతి భద్రతలను కాపాడాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం విడపనకల్లు మండలం వేల్పుమడుగు గ్రామంలో పర్యటించి, సుంకులమ్మ దేవాలయంలో జాతర నిర్వహణపై గ్రామ ప్రజలు, పెద్దలతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల సమయంలో 22 ఆలయాలలో జాతరలు జరగనున్నాయని, ఆయా ఆలయాలకు ఆర్డీవోలు, తహసిల్దార్లు వెళ్లి గ్రామస్తులు, పెద్దలతో మాట్లాడడం జరుగుతుందన్నారు. వేల్పుమడుగు గ్రామంలో సుంకులమ్మ జాతరను ప్రశాంతంగా నిర్వహించాలని, గ్రామ పెద్దలు, ప్రజలు ఇందుకు అన్ని విధాలా సహకారం అందించాలన్నారు. గ్రామంలో జాతరను పెద్దగా జరుపుకోవాలని ఆలోచన ఉంటుందని, అయితే ఎన్నికల పరిమితులను కాపాడాలన్నారు. జాతరను ఎన్నికల కౌంటింగ్ అనంతరం జరుపుకునేందుకు మార్చుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఒక భక్తుడిలా జాతరలో పాల్గొనాలని, ఎవరూ గొడవలకు పాల్పడరాదన్నారు. ఎన్నికలంటే ఎవరో ఒకరు గెలుస్తారని, ఫలితాలను అందరూ స్వాగతించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎన్ని ఇళ్లు ఉన్నాయి, దేవాలయంలో ఎన్నిసార్లు పూజలు చేస్తారు, తదితర వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. సుంకులమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గుంతకల్లు ఆర్డీఓ వి.శ్రీనివాసులురెడ్డి, తహసీల్దార్ దస్తగిరయ్య, ఎంపిడిఓ వి.కొం దయ్య, ఎస్ఐ ఖాజా హుస్సేన్, డిప్యూటీ తహసీల్దార్ బసవకుమార్ పాల్గొన్నారు.

మండలంపై పట్టు ఉండాలి..

విశాలాంధ్ర-ఉరవకొండ : మండలంపై అధికారులకు పట్టు ఉండాలని, తహసీల్దార్ కార్యాలయ రికార్డులు పక్కాగా ఉండాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. బుధవారం విడపనకల్లు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. సిబ్బంది వివరాలు ఆరా తీశారు. రికార్డ్ గదిని, ఎఫ్ఎంబి, డిపట్టా రిజిస్టర్, హౌస్ సైట్ రిజిస్టర్, మెజిస్ట్రేట్ వారి రిజిస్టర్, మండల మ్యాప్‌ని, కార్యాలయ పరిసర ప్రాంతాలను, అన్ని గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యాలయంలో సిటిజన్ చార్ట్ ఏర్పాటు చేయాలని, ఎలాంటి సేవలందిస్తున్నారనేది ప్రజలకు తెలియజేయాలన్నారు. మండలంలో సీసీఆర్సీ కార్డులను కూడా మంజూరు చేయాలని, ఇందుకోసం రైతులను గుర్తించాలన్నారు. మహిళలకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు కేటాయించాలన్నారు. ప్రొఫార్మా ప్రకారం అన్ని వివరాలను సిద్ధం చేసి అందించాలన్నారు. తహసీల్దార్ కార్యాలయం ద్వారా ప్రజలకు అవసరమైన అన్ని సేవలను ఎప్పటికప్పుడు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో గుంతకల్లు ఆర్డీఓ వి.శ్రీనివాసులురెడ్డి, తహసీల్దార్ దస్తగిరయ్య, ఎంపిడిఓ వి.కొండయ్య, డిప్యూటీ తహసీల్దార్ బసవకుమార్, రీసర్వే డిటి వెంకటేశ్వర ప్రసాద్, కార్యాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ముందస్తు అడ్మిషన్లు

- పుస్తకాల పేరుతో నిలువు దోపిడీ..
- నారాయణ స్కూల్‌పై చర్య తీసుకోవాలి
- ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన

విశాలాంధ్ర-జెఎన్‌టియుపి : ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని బుధవారం అనంతపురం నగరంలో కళ్యాణ్ దుర్గం బైపాస్‌లో ఉన్న నారాయణ బ్రాంచ్ వద్ద ఏఐఎస్ఎఫ్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణయ్య, కుల్లాయి స్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్ మాట్లాడుతూ ..విద్యా సం.. ప్రారంభం కాకముందే నారాయణ విద్యాసంస్థలు ముందస్తుగా అడ్మిషన్లు చేపట్టాయని, అంతేకాక నిబంధన తుంగలో తొక్కుతూ నారాయణ పాఠశాల పేరుతో ముద్రించిన పాఠ్య పుస్తకాలు ఒక్క తరగతికి రూ.8 వేల నుంచి రూ.12 వేల వరకు విక్రయిస్తున్నాయని ధ్వజమెత్తారు. జిల్లా విద్యాశాఖ అధికారులు ఎన్నికల హడావిడిలో ఉండటంతో అడ్మిషన్లు యథేచ్ఛగా చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని ఆధారాలతో సహా జిల్లా విద్యాశాఖ అధికారులకు తెలియజేసి వారం రోజులు గడుస్తున్నా ఒక్క విద్యాసంస్థను కూడా సందర్శించలేదని తెలిపారు.. కార్పొరేట్ విద్యాసంస్థలకు ప్రత్యక్షంగా పరోక్షంగా మద్దతు పలుకుతున్న డీఈఓ పైన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతపురంకు సంబంధించి ఎంఈఓ వెంకటస్వామికి అడ్మిషన్లు, పుస్తకాల అమ్ముతున్నారని తెలియజేశామని, కనీసం ఫోన్లు ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించిన స్పందించడం లేదన్నారు. తక్షణమే ఎంఈఓ వెంకటస్వామిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, కలెక్టర్ స్పందించి ముందస్తు అడ్మిషన్లు చేస్తూ పాఠ్య పుస్తకాలమ్ముతున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష,కార్యదర్శులు మంజునాథ్, ఉమా మహేష్, జిల్లా ఉపాధ్యక్షులు వంశీ, నాయకులు సమీర్ ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిద్దు, నగర అధ్యక్షులు భీమేష్ పాల్గొన్నారు.

24న పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర-జేఎన్టీయూపి: పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షలు ఈ నెల 24నుండి జూన్ 03 వరకు జరగనున్నాయని డీఈఓ బి.వరలక్ష్మి పేర్కొన్నారు. పరీక్షకు మొత్తం 13,332 మంది విద్యార్థులు జిల్లా వ్యాప్తంగా 45 కేంద్రాలలో ఉదయం 9:30 నుండి 12 45 నిమిషాల వరకు పరీక్షలు రాయనున్నారు. పదో తరగతి సిలబస్ మారుతున్న తరుణంలో జిల్లాలోని అన్ని యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకుని ప్రతి విద్యార్థి పరీక్షకు తెలియజేసి, హాజరయ్యేలా చర్యలు కోరారు. పరీక్ష జరిగేరోజే ఫీజు చెల్లించి హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకొని పరీక్షకు హాజరు కావొచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 23, మే 2024

వైఎస్ఆర్ లేఔట్‌లో అక్రమ కట్టడాలు తొలగింపు

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని వైయస్సార్ లేఔట్‌లో సర్వేనెంబర్ 228బి1,228బి2 రెండు లెటర్‌లో సుమారు 28, 32 సెంట్ల భూమిలో పేదల కోసం 1006 పట్టాలను మంజూరు చేసింది. అందులో భవిష్యత్ అవసరాల కోసం కొంత స్థలాన్ని ప్రభుత్వం రిజర్వ్ చేసి ఉంచగా అందులో కొంతమంది అక్రమంగా కట్టడాలు పునాదుల నిర్మాణం చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం తాసిల్దార్ ఉదయ శంకర్ రాజు, నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ, వైయస్సార్ లేఔట్‌లో స్థలాలను పరిశీలించి అక్రమ కట్టడాలను పరిశీలించి జేసీబీలతో తొలగించారు లబ్ధిదారులు అక్రమ కట్టడాలు తొలగించకూడదని ఎంతో కష్టం చేసుకుని నిర్మించుకున్నామని వాటిని తొలగిస్తే అప్పుల పాలు అవుతామని తెలుపగా నిర్మాణం చేయకముందే పట్టాలు లేకుం డానే కట్టకూడదని తెలిపినా కూడా నిర్లక్ష్యంతో ఎలా నిర్మాణం చేపట్టారని ప్రశ్నించారు. ఇకపై ఆ స్థలంలో ఎవరూ నిర్మాణాలు చేపట్టకూడదన్న ఉద్దేశంతో తొలగింపునకు వచ్చామని తెలిపారు. రిజర్వ్ స్థలంలో కొంత స్మశాన వాటిక, పాఠశాల నిర్మాణం అంగనవాడి భవనాల నిర్మాణం, సచివాలయాల నిర్మాణం కోసం ప్రభుత్వం కేటాయించిన భూమిని ఆక్రమించు కుంటున్నారని అందువలన తొలగించాల్సిన పరిస్థితి వచ్చిందని తాసిల్దార్ ఉదయ శంకర రాజు, నగర కమిషనర్ వంశీకృష్ణ భార్గవ తెలిపారు. ప్రభుత్వ రిజర్వ్ స్థలాలలో కానీ ప్రభుత్వ స్థలాల్లో కానీ ఎవరైనా అక్రమ కట్టడాలు నిర్మిస్తే తప్పకుండా తొలగిస్తామని కావున ప్రభుత్వ ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు ప్రభుత్వ స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. కొసమెరుపు.. కొంతమంది పట్టణంలో విలువైన ప్రభుత్వ స్థలంలో తాగునీటి అవసరాలకు వేసుకున్న బోరును కూడా పూడ్చివేసి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించుకున్నారని వాటిపైన కూడా చర్యలు తీసుకోవాలని కొంతమంది అధికారులపై ధ్వజమెత్తారు ఇలాంటి వాటి మీద చర్యలు తీసుకోరు కానీ పేదల స్థలాలపై వెంటనే చర్యలు తీసుకుంటారని మండిపడ్డారు.

గెలుపు ఎవరిదో..

- ఓట్ల లెక్కింపునకు దగ్గర పడుతున్న సమయం
- అభ్యర్థుల గుండెల్లో మొదలైన గుబులు..
- జూన్ 4న నువ్వా? నేనా..?
- ఆశల పల్లకిల్లో అభ్యర్థులు
- గెలుపు, ఓటమిలపై తీవ్ర మంతనాలు

విశాలాంధ్ర-ధర్మవరం : ధర్మవరం నియోజక వర్గంలో మే 13వ తేదీన పోలింగ్ పూర్తి కావడం, జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడనుండటంతో ఎమ్మెల్యే అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. ఈ క్రమంలో తమ పార్టీ సీనియర్ నాయకులతో గెలుపు ఓటమిలపై తీవ్రంగా మంతనాలు చేస్తున్నారు. ముఖ్యంగా ధర్మవరంలో వైసీపీ పార్టీ తరపున కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, ఎన్డీఏ కూటమి (టిడిపి, జనసేన, బిజెపి) తరపున సత్యకుమార్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ తరపున రంగన అశ్వర్థ నారాయణ బరిలో ఉన్నారు. వీరు ముగ్గురు తమదైన శైలిలో ఎండనక వాననక తమ ప్రచారాలు హెూరెత్తించారు. అయితే ఓటరు నాడి పట్టలేకున్నారు. జూన్ 4వ తేదీన లేపాక్షి మండలం చోళసముద్రం గ్రామ సమీపంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో కౌంటింగ్ కేంద్రాన్ని కలెక్టర్ ఏర్పాటు చేశారు. ఆరోజు సాయంత్రంలోపు ఎన్నికల ఫలితాలు వెలువడేలా అధికారులు ప్రణాళికకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం పట్టణంలో ఎక్కడ చూసినా ధర్మవరంలో ఈసారి ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది..? ఏ ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి..? జిల్లాలో అధిక మెజారిటీ ఏ పార్టీకి వస్తుంది అన్న విషయాలపై తీవ్రంగా ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈసారి ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరగడంతో తమకు అనుకూలమని ఆయా పార్టీ అభ్యర్థులు అభిప్రాయపడుతున్నారు. ఎన్నడూ లేని విధంగా పోస్టల్ బ్యాలెట్‌లో కూడా అధిక సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల సంఖ్య కూడా కౌంటింగ్ ఫలితాల్లో కీలకపాత్ర వహిస్తుందని పలువురు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అంతేకాకుండా మే 13వ తేదీ అర్ధరాత్రి వరకు ధర్మవరం ప్రజలు తమ ఓటు హక్కును ఎంతో ఓపికతో వినియోగించుకున్నారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత ఉందా? లేదా? ఇతర పార్టీల వైపు ఉందా? అన్న అనుమానాలు రేకెత్తిస్తు న్నాయి. 13న జరిగిన పోలింగ్లో మొత్తం 84.82 శాతం ఓటింగ్ నమోదైందని రిటర్నింగ్ ఆఫీసర్ వెంకట శివరామిరెడ్డి తెలిపిన విషయం విదితమే. ఈసారి మహిళల ఓటింగ్ సంఖ్య అధికం కావడం ఫలితాలపై ప్రభావం చూపనుంది. ఇక పట్టణంలో, గ్రామీణ ప్రాంతా లలో ఏ ఏ పార్టీలు అధిక మెజార్టీతో గెలుస్తాయి అన్న అనుమానం ప్రజల్లో ఉండిపోయింది. జిల్లాలో ఏడు నియోజకవర్గాలలో ఏ పార్టీ గెలుపు కైవసం చేసుకుంటుంది అన్నది కూడా జూన్ 4న తేల నుంది. పెరిగిన ఓటింగ్ శాతం ఎవరికి లాభపడుతుంది అన్న విషయంలో ప్రధాన పార్టీలు చర్చించుకుంటున్నాయి.

అశ్వ వాహనంపై దర్శనమిచ్చిన చెన్నకేశవ స్వామి....

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో గల శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి వారి బ్రహ్మోత్సవ వేడుకలు ఈనెల 15వ తేదీ నుండి 25వ తేదీ వరకు(11 రోజులు) ఆలయ ఈవో వెంకటేశులు, ఉభయ దాతలు,రథోత్సవ కమిటీ అధ్యక్షులు దాశెట్టి సుబ్రహ్మణ్యం, సభ్యులు ద్వారా అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాల వేడు కల్లో 8వ రోజు బుధవారం ఉదయం అర్చ కులు కోనేరాచార్యులు, మకరందబాబు, భానుప్రకాష్, చక్రధర్ వేదమంత్రాల నడుమ స్వామివారికి తొలి పూజలు నిర్వహించారు. సాయంత్రం అశ్వవాహనంలో ఆశీనులైన స్వామి వారిని రథోత్సవ కమిటీ, ఉభయదాతలు రథాన్ని లాగారు. తదుపరి పట్టణంలోని భక్తదులకు స్వామివారి దర్శనమిచ్చారు. ఉభయ దాతలుగా కీర్తిశేషులు దేశాయి కృష్ణమూర్తి జ్ఞాపకార్థం ఉషారాణి, దేశాయి సత్యనారా యణ రావు, కుమారుడు వెంకట్‌నిఖిల్, నిఖిత, ఇందిరా లయన్ జగ్గా వేణు గోపాల్, తేజస్విని, జగ్గా బాలస్వరూప్, వాణి, జగ్గా మోహన్ రాయల్, సరళాదేవి, కలవల శ్రీనివాసులు, శర్వాణి, యాదాలం కమలాకర్, ఉషా, మేడ రవిచంద్ర, ప్రసాద్ వ్యవహరించారు. ఊరేగింపులో అన్నమయ్య సేవా మండలాధ్యక్షులు పోరాళ్ల పుల్లయ్య బృందం, గోదా రంగనాథ మహిళా మండలి గురువు భవాని, అధ్యక్షులు మంజుల, వారి శిష్య బృందం ప్రదర్శించిన కోలాటం, అన్నమయ్య సంకీర్తనలు అందర్నీ ముగ్ధుల్ని చేశాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో వెంకటేశులు, ఆలయ సిబ్బంది రామశాస్త్రి, మల్లికార్జున, హరి పాల్గొన్నారు.

26న ఉచిత చిన్న పిల్లల వైద్య శిబిరం



విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని పుట్టపర్తి రోడ్, సాయినగర్‌లో గల స్పందన హాస్పిటల్‌లో ఈనెల 26వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు చిన్న పిల్లల ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు స్పందన హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్. బషీర్, డాక్టర్. సోనియా తెలిపారు. చిన్న పిల్లలకు వచ్చే జ్వరం, విషజ్వరాలు, దగ్గు, ఊపిరి తిత్తుల సమస్యలు, కడుపునొప్పి, మలేరియా, టైఫాయిడ్, న్యూమోనియా, పురిటి పిల్లల పచ్చ కామెర్లు, బేదులు, మెదడు వాపు వ్యాధి తదితర జబ్బులకు ప్రభుత్వ పథకాల ద్వారా ఉచితంగా అడ్మిషన్ చేసుకొని వైద్య సేవలందిస్తామన్నారు. ప్రతి సోమవారం ఉదయం పదిగంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉచితంగా ఓపి కూడా చూడబడునని తెలిపారు. పురిటి పిల్లల కోసం ఐసీయూ, ఫొటో తెరపి, హైఫ్లో ఆక్సిజన్ మిషన్స్, వెంటిలేటర్లు అన్నివేళలా అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రముఖ ఎండి, (కర్నూల్ మెడికల్ కాలేజ్) చిన్నపిల్లల వైద్య నిపుణులు- డాక్టర్ కే.మహేంద్ర చే మంచి వైద్య చికిత్సలతో పాటు చిన్నపిల్లల పట్ల ఆరోగ్యం విషయంపై సూచనలిస్తారని తెలిపారు.

ఘనంగా నృసింహ జయంతి ...

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని సిద్దయ్య గుట్టలో వెలిసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి జయంతి వేడుకలు ఆలయ కమిటీ అధ్యక్షురాలు జయశ్రీ, కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అర్చకులు రవీంద్రనాథ శర్మ, పరశురామ శర్మ మంగళ వాయిద్యాలు నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి శ్రీ లక్ష్మీనరసింహ మూలవిరాట్ విగ్రహాలకు వివిధ అభిషేకాలతో పాటు వివిధ పూలు, తులసి మాలలుతో అలంకరించిన వైనం విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం భక్తులు నరసింహ స్వామిని కీర్తిస్తూ భజనలు చేశారు. తదుపరి అర్చకులు మట్లాడుతూ నరసింహ స్వామి విష్ణుమూర్తి అవతారాలలో చాలా ముఖ్యమైన శక్తివంతమైన అవతారమని, దుష్టుడైన హిరణ్య కశ్యపుడిని సంహరించేందుకు స్వామి ఈ రూపంలో అవతరించారని తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షురాలు జై శ్రీ మాట్లాడుతూ 400 సంవత్సరాల కిందట ఉన్న ఈ ఆలయాన్ని పునః ప్రతిష్ట చేశామని, అతి త్వరలో ఈ ఆలయ నిర్మాణం పూర్తి అవుతుందని, ఈ ఆలయానికి దాతలు తమకు తోచిన విరాళాలివ్వాలని కోరారు.

దాడి కేసులో ముగ్గురు అరెస్ట్

విశాలాంధ్ర-ధర్మవరం: మండల పరిధిలోని ఓబుల నాయుడు పల్లిలో టీడీపీ వారిపై దాడి చేసిన ఘటనలో ముగ్గురిని అరెస్టు చేసినట్లు బుధవారం రూరల్ ఎస్సై నరేంద్ర తెలిపారు. పోలింగ్ సందర్భంగా ఏజెంటుగా లింగమయ్య కొడుకు సింహాద్రి కూర్చున్నాడని వారిపై ఈ నెల 14న అదే గ్రామానికి చెందిన ఐదుగురు వైసీపీ నాయకులు గంగాధర్ నాయుడు, ఆదినారాయణ, శ్రీనివాసులు, సోమశేఖర్, అనంతరాయుడు దాడి చేశారు. దీనిపై అప్పట్లోనే బాధితులు రూరల్ పోలీసులు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేయడం జరిగింది. దీంతో రూరల్ పోలీసులు దాడి చేసిన దాసరి శ్రీనివాసులు, సోమశేఖర్, అనంతరాయుడులను అరెస్టు చేసి, కోర్టుకు హాజరుపరచడం జరిగిందని తెలిపారు. కోర్టు వారికి రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు. ఎన్నికల ఫలితాలు వచ్చేవరకు గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఫ్యాక్షన్ గ్రామాలలో పోలీసుల నిఘా అధికం చేస్తామని తెలిపారు.

అప్పుల బాధ తాళలేక చేనేత కార్మికుడు ఆత్మహత్య

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని శివానగర్లో షీలా బాల చౌడయ్య(29) అనే చేనేత కార్మికుడు అప్పుల బాధ తాళలేక మంగళవారం రాత్రి ఇంట్లోనే ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... మృతుని తండ్రి లేట్ లక్ష్మీనారాయణ తల్లి మహాలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇందులో పెద్ద కుమారుడు మృతి చెందిన షీలా బాల చౌడయ్య కూలి మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. రెండవ కుమారుడు గిరీష్ బీటెక్ పూర్తి చేశాడు. రెండు సంవత్సరాల కిందట మృతుడు బాలచౌడయ్యకు అదే వార్డుకు చెందిన పద్మావతి తో ఘనంగా వివాహాన్ని జరిపించారు. భార్యాభర్తలు కేశవ నగర్ లో మగ్గాల బిల్డింగులు కూలి మగ్గం చేసుకుంటూ ఉండేవారు బాల చౌడయ్య వివాహం కోసం కుటుంబ పోషణ కోసం అప్పులు చేశాడు. నేసిన చీరలకు గిట్టుబాటు ధర లభించలేకపోవడం వల్ల తెలిసిన, తెలియని చోట దాదాపు నాలుగు లక్షలకు పైగా అప్పు చేశాడు. అప్పు ఎలా తీర్చాలో దిక్కుతోచక తరచూ తీవ్ర మనోవేదనకు గురై మంగళవారం భార్య పుట్టింటికి వెళ్ళగా, ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయాన్నే తల్లి మహాలక్ష్మి సోదరుడు గిరీష్లు వేలాడుతున్న బాల చౌడయ్య దృశ్యాన్ని చూచి చలించిపోయారు. పోలీసులు మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు

పరామర్శించిన చేనేత సంఘం నాయకులు... చేనేత సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, జిల్లా అధ్యక్షులు పోలా లక్ష్మీనారాయణ, జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకటస్వామి, నాయకులు రవి వర్ధన్ తదితరులు మృతుడు షీలా చౌడయ్య ఇంటికి వెళ్లి ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంతాపం తెలిపారు. చేనేత సంఘం నాయకులు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వాలు వచ్చినా చేనేత కార్మికుల భవిష్యత్తు అంధకారంగా మారిందని, ఆదుకునే నాధుడు లేక చేనేత పరిశ్రమ కుంటుపడిందని మండిపడ్డారు. కుటుంబాన్ని పోషించుకోలేక బలవన్ మరణానికి పాల్పడడం బాధాకరమని తెలిపారు. ఆర్థిక సహకారం అందించి ఆదుకోవాలని కోరారు.

గ్రామాల్లో పోలీసుల కార్డెన్ సెర్చ్

విశాలాంధ్ర-పెనుకొండ : మండల పరిధిలోని మావుటూరు గ్రామంలో బుధవారం పోలీసులు కార్డెన్ సర్చ్ నిర్వహించారు. పెనుకొండ సీఐ యుగంధర్, నేతృత్వంలో ఎస్సై రాజేష్, రోద్దం ఎస్సై వలి భాషా, పరిగి ఎస్ఐ, సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది కలిసి గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా అనుమానిత ఇళ్లలో సోదాలు నిర్వహించారు, ఎటువంటి మారణాయుధాలు దొరకలేదని ప్రజల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు పిలుపునిచ్చారు, గ్రామంలో కర్ణాటక మద్యం అమ్మరాదని, అనుమతులు లేని వాహనాలను వాడరాదని గ్రామస్తులకు తెలిపారు గ్రామంలో ఎవరైనా గొడవలకు పాల్పడితే ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు.

గ్రామస్తులు సమన్వయంతో మెలగాలి

విశాలాంధ్ర-ధర్మవరం: గ్రామ ప్రజలు సమన్వయంతో ఉంటూ, చట్ట పరిధిలోనే జీవించాలని రూరల్ ఎస్సై నరేంద్ర తెలిపారు. బుధవారం మండల పరిధిలోని సుబ్బారావుపేట గ్రామంలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఎస్ఐ నరేంద్ర మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి హింసకు తావులేకుండా ఉండాలని, గొడవలు చేసిన, ప్రోత్సహించిన అది నేరమవుతుందని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రౌడీ షీటర్లు తమ ప్రవర్తన మార్చుకోవాలని, గొడవలు సృష్టిస్తే తీవ్రమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామ ప్రజలు జూన్ 4వ తేదీ వరకు సమన్వయంతో ఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు.

ధర్మవరంలో ఘనంగా దుర్గమ్మ పరుష

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని దుర్గమ్మ తల్లి ఆలయం ఈవో వెంకటేశులు, భక్తుల నడుమ దుర్గమ్మ పరుష ఈనెల 21 నుండి 23వ తేదీ వరకు మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో వెంకటేశులు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు 15వ తేదీ నుండి 21వ తేదీ వరకు మడుగుతేరుతో జరిగాయి. అటు తర్వాత దుర్గమ్మ పరుష వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మూడు రోజులు పాటు దుర్గమ్మ తల్లిని ప్రత్యేక, విశేష పూజలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ పరుష సందర్భంగా వివిధ తినుబండారాల అంగళ్ళు, ఆట బొమ్మల అంగళ్ళు, పదుల సంఖ్యలో వెలిశాయి. బ్రహ్మోత్సవ వేడుకలు 25వ తేదీతో ముగుస్తాయని తెలిపారు. వందలాదిమంది భక్తాదులు ఇతర జిల్లాల నుంచి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది రామశాస్త్రి మల్లికార్జున, హరికృష్ణ, కిష్ట పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే దాడి..

విశాలాంధ్ర-పెనుకొండ : మండల పరిధిలోని మావుటూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు క్రిష్టప్ప పై గత 5 రోజుల క్రితం దొమ్మితి మర్రి వద్ద మావుటూరు గ్రామం వైసీపీ నాయకులు దాడిచేయగా చికిత్స పొంది ఇంటిలో విశ్రాంతి తీసుకొంటు ఉండగా ఇంటికి వెళ్లి పెనుకొండ నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ పరామర్శించారు. ధైర్యంగా ఉండు.. అండగా ఉంటామని తెలిపారు. ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు దాడికి పాల్పడటం సిగ్గుచేటన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం..

విశాలాంధ్ర-హిందూపురం : హిందూపురం టౌన్ సబ్ డివిజన్ పరిధిలోగల, ముదిరెడ్డిపల్లి సెక్షన్ పరిధిలోని మనేసముద్రం సబ్ స్టేషన్ పరిధిలోని మనేసముద్రం, మలుగురు, గొల్లపల్లి, ఊటుకూరు గ్రామాలలో సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మహేష్ కుమార్ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

కాకి గ్రామంలో 30 మందికి వాంతులు విరేచనాలు..

విశాలాంధ్ర-రొళ్ల : మండలంలోని కాకి గ్రామంలో 30 మంది వరకు వాంతులు, వీరేచనాలు కావడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సోమవారం పలువురికి వాంతులు, వీరేచనాలు అయినట్లు తెలిపారు. అదేరోజు రోజుకి మరింత మందికి వ్యాధి ప్రబలి బుధవారం నాటికీ 30 మంది వరకు ఈ వ్యాధి వ్యాపించినట్లు గ్రామస్తులు తెలిపారు. మధుగిరి, మడకశిర, రొళ్ల ప్రభుత్వ, ప్రవేట్ ఆసుపత్రిలో వైద్యాచికిత్సలు పొందినట్లు తెలిసింది. ఇటీవల కురిసిన వర్షాలకు నీటి కలుషితమై ఈ వ్యాధి ప్రభలినట్లు గ్రామస్థులు తెలియజేస్తున్నారు. గ్రామాన్ని బుధవారం ఎంపిడిఓ ప్రసాద్, ఈ.ఓ.ఆర్.డి క్రిష్ణప్ప సందర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. పి.హెచ్.సి సిబ్బంది కూడా గ్రామస్తులకు అందుబాటులో ఉండి ప్రజలకు వైద్య చికిత్సకు సహకరిస్తామని ఆరోగ్య సిబ్బంది తెలిపారు.

అధికారుల మోసానికి గురై రైతు ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర-అమడగూరు: మండల పరిధిలోని తిమ్మిరికుంటపల్లి గ్రామానికి చెందిన పెద్ద వీరప్ప అను రైతు బుధవారం మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం ముందు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం గమనించిన రెవెన్యూ సిబ్బంది, చుట్టుప్రక్కవారు అతని వద్ద నుండి పురుగుల మందు డబ్బాను లాక్కొని అతన్ని ఓదార్చారు. బాధితుడు మీడియాతో మాట్లాడుతూ పెట్టిన పంటలు చేతికందక అప్పులపాలై గ్రామం వదిలి కర్ణాటక రాష్ట్రమైన బెంగళూరుకు కుటుంబంతో సహా వలస వెళ్లానని, నాకున్న పొలం సర్వేనెంబర్ 841 లో ఐదు ఎకరాల 58 సెంట్లు భూమి ఉందని, గతంలో నా పొలం పైన బ్యాంకు లోను తీసుకున్నానని, బ్యాంకు లోన్ రెన్యువల్ చేయడానికి బ్యాంకుకు వెళితే బ్యాంక్ మేనేజర్ నీ పొలం నీ పేరు మీద లేదని మరొకరి పేరు మీదకు మారిపోయిందని, నీవు రెన్యువల్ చేయడానికి వీలు కాదని, తీసుకున్న బ్యాంకులో మొత్తం చెల్లించాలని తెలపడంతో నా పొలం నాకు తెలియకుండా మరొకరి పేరు మీదకు ఎలా వెళుతుందని అడిగినా బ్యాంకు వారు ఆ విషయం మాకు తెలియదని, వెళ్లి తాసిల్దార్ కార్యాలయ అధికారులను సంప్రదించాలని తెలిపారన్నారు. రెవెన్యూ అధికారులకు విషయం తెలుపగా వారు నిజమే నీ పొలం గత ఎనిమిది నెలల క్రితమే అదే గ్రామానికి చెందిన గంగాదేవి పేరు మీద మార్చేశామని, మాదే పొరపాటని, తిరిగి నీ పొలాన్ని వెంటనే నీ పేరు మీదకు మార్చేస్తామని, నువ్వు రేపు రా, మాపురా అంటూ గత 15 రోజుల నుండి తిప్పుకుంటున్నారే తప్ప నా పొలాన్ని నా పేరు మీదకు మార్చకపోగా రెవెన్యూ అధికారులు నన్ను మోసం చేశారని, ఇక నా పొలం నాకు దక్కదని మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డానని బాధితుడు కన్నీరు మున్నీరయ్యాడు. నాలాంటి బాధిత రైతులు ఎంతోమందిని ఈ కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని, కార్యాలయంలోని సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ నాలాంటి అనేకమంది రైతన్న లను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి నా పొలాన్ని నాకు ఇప్పించి, నాకు మోసం చేసిన అధికారులపై వెంటనే తగు చర్యలు తీసుకోవాలని, లేకపోతే నా కుటుంబానికి ఆత్మహత్యలే శరణ్యమని కన్నీటి పర్యాంతమయ్యారు.

రాష్ట్రంలో రాబోయేది ఎన్‌డీఏ ప్రభుత్వమే

కూటమికి 130కి పైగా సీట్లు వస్తాయి

పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ

విశాలాంధ్ర-పెనుకొండ : రాష్ట్రంలో రాబోయేది ఎన్.డి.ఎ. ప్రభుత్వమేనని, కూటమికి 130కి పైగా సీట్లు వస్తాయని పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ అన్నారు. బుధవారం పెనుకొండ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ కలసి విలేకరులతో మాట్లాడుతూ అధికారం చేపట్టాక అభివృద్ధితో వైసీపీపై ప్రతీకారం తీర్చుకుంటామని అన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ఉప్పెన లా తరలి వచ్చిన జిల్లా ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలలో చేసిన దౌర్జన్యాలు, అరాచకాలు సార్వత్రిక ఎన్నికలలో కొనసాగించి గెలుపు సొంతం చేసుకోవాలని వైసీపీ నాయకులు విఫల ప్రయత్నం చేశారని ఎద్దేవా చేశారు. సార్వత్రిక ఎన్నికలు సాధ్యమయినంత మేర సజావుగా జరిగేందుకు సహకరించిన అధికారులకు, మీడియా మిత్రులకు, ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. వైసీపీ పాలనతో విసిగిపోయి, చంద్రబాబు నాయకత్వం ఈ రాష్ట్రానికి అవసరమని భావించి యువత, మహిళలు అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు వేశారు. సత్యసాయి జిల్లాల్లో ఏడు నియోజకవర్గా లతో పాటు , పార్లమెంట్ ఎంపీ స్థానం కూడా గెలవబో తున్నాంగత ఐదేళ్ల భయాందోళనలతో పని చేసిన అధికారులు ఇప్పుడు ఒక బాధ్యతగా వ్యవహరించారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం శ్రమించారు. ఎన్‌డీఏ కూటమికి దాదాపు 130 సీట్లు రాబోతున్నాయి. ఎన్నికలకు ముందు వై నాట్ 175 అని చెప్పుకున్న వైసీపీ ఇప్పుడు కనీసం 75 సీట్లు వస్తాయని చెప్పుకునేందుకు వెనుకాడుతోంది. జగన్‌కు షాక్ అయ్యేలా ఫలితాలుంటాయి. ప్రజలు ఏకపక్షంగా కూటమివైపు మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. కేడర్ జారి పోకుండా వైసీపీ మైండ్ గేమ్ ఆడుతోంది .పిన్నెల్లి రామకృష్ణ రెడ్డి ఈవీఎం ధ్వంసం చేయడం చూస్తుంటే వాళ్ల ఫ్రస్ట్రేషన్ అర్థమవుతుంది, జూన్ 9న సీఎంగా చంద్ర బాబు ప్రమాణస్వీకారం చేయబోతున్నారని సత్యసాయి జిల్లాకు మరిన్ని పరిశ్రమలు తాగునీటి, సాగునీటి, ప్రాజెక్టులు మరిన్ని తీసుకువస్తామని జిల్లాను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు.

పది, ఇంటర్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు...

విశాలాంధ్ర-గోరంట్ల: గోరంట్ల చౌడేశ్వరి కాలనీలో గల రామస్వామి దేవాలయం వద్ద మండలంలోని దేవాంగ కులస్తుల విద్యార్థులు పదో తరగతి ఇంటర్ పరీక్షా ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాల కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు బుధవారం దేవాంగం జగదీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులను భగవద్గీత పెద్దబాలశిక్ష డిక్షనరీలతో పాటు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు మంచి విద్యను అభ్యసించాలని విద్యతోనే భవిష్యత్తు ఉంటుందని ఎవరు నిర్లక్ష్యం చేయకుండా మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. ప్రతి ఏడాది ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ఇస్తామని, విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రులకు పట్టణానికి మంచిపేరు తేవాలని కోరారు. కార్యక్రమంలో వార్డ్ మెంబర్ నాగరాజు, డీవీ రమణ, కెంపుల నాగభూషణ, కెంపుల చంద్ర మోహన్, డి.శ్రీనివాసులు, ఆర్డిటి వెంకటేష్, అశ్వర్థ నారాయణతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రజలు పాల్గొన్నారు. వార్డు మెంబర్ నాగరాజు విద్యార్థులకు కార్యక్రమానికి హాజరైన వారికి అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు.

రేపటి నుంచి పది సప్లిమెంటరీ పరీక్షలు

విశాలాంధ్ర-కొత్తచెరువు: ఈనెల 24వ తేదీ నుండి 10 తరగతి సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని డీఈవో మీనాక్షి తెలిపారు. ఉదయం 9:30 నుండి 12:45 వరకు పరీక్షలు జిల్లా వ్యాప్తంగా కొనసాగుతాయి అన్నారు. 24 తెలుగు, 25 హిందీ, 27 ఇంగ్లీషు, 28 గణితం, 29 ఫిజికల్ సైన్స్, 30 బయాలజికల్ సైన్స్, 31 సోషల్ స్టడీస్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షలకు ఏర్పాటులను జిల్లా వ్యాప్తంగా సిద్ధం చేయడం జరిగిందన్నారు.

మండలానికి చేరిన పాఠ్యపుస్తకాలు

విశాలాంధ్ర - అగళి : 2024-25 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వం విద్యార్థులకు అందించే ఉచిత పాఠ్యపుస్తకాలు బుధవారం ఎంఆర్‌సికి చేరాయి. ప్రభుత్వం నుంచి ఉచిత పాఠ్యపుస్తకాలు బుధవారం మండలానికి చేరినట్లు ఎంఈఓ 2 చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. మండలంలోని 45 పాఠశాలలలో విద్యాభ్యాసం చేసే ఒకటి రెండు మూడు, అలాగే ఐదు ఆరు ఏడు, తరగతుల విద్యార్థులకు గాను 6,175 పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు తెలిపారు. పాఠశాలల వారీగా ప్రధానోపాధ్యాయులకు అందజేస్తామని చెప్పారు.

విత్తనం కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి

విశాలాంధ్ర-కదిరి: మండల పరిధిలోని అన్ని గ్రామాలకు చెందిన రైతులందరూ వేరుశనగ విత్తన కోసం సమీపంలోని ఆర్ బి కే కేంద్రాల వద్ద తమ పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేరుశెనగ విత్తనాలు కావలసినవారు రైతు భరోసా కేంద్రాల వద్దకు పట్టాదారు పాసుపుకం,ఆధార్ కార్డు,మొబైల్ ఫోన్ కచ్చితంగా తీసుకొని వెళ్ళాలన్నారు. 0 - 0.5 ఎకరాలు ఉన్న రైతుకు 30 కేజీల బ్యాగ్ ఒకటి -0.5- 1.0 ఎకరాలు ఉన్నా రైతుకి 30 కేజీల బ్యాగులు రెండు, ఎకరా పైనున్న వారికి 30 కేజీల బ్యాగులు 3 పంపిణీ చేస్తామన్నారు. కె-6, టిసిజిఎస్-1694 రకం విత్తనానికి సంబంధించి 30 కేజీల 1 బ్యాగ్ పూర్తి ధర రూ.2,850 ఉండగా, అందులో సబ్సిడీ 1,140 రూపాయలు పోగా రూ.1,710 చెల్లించాలన్నారు.కె.6, టీసీజి ఎస్-1694 రకం విత్తనానికి సంబంధించి 60 కేజీల 2 బ్యాగ్‌ల పూర్తి ధర రూ.5,700 ఉండగా, అందులో సబ్సిడీ రూ.2,280 పోను రూ.3,420 చెల్లించాలని, కె-6, టి సిజి ఎస్ - 1694 రకం విత్తనానికి సంబంధించి 90 కేజీల 3 బ్యాగ్ ల పూర్తి ధర రూ.8,550 ఉండగా, సబ్సిడీ రూ.3,420 పోగా రూ.5,130 చెల్లించాలని, కదిరి లేపాక్షి (కె - 1812) రకం విత్తనానికి సంబంధించి 30 కేజీల 1 బ్యాగ్ పూర్తి ధర రూ.2,610 ఉండగా, రూ.1,566 చెల్లించాలని తెలిపారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, గురువారం 23, మే 2024

కూడేరు మండలానికి చేరిన పాఠ్య పుస్తకాలు...

విశాలాంధ్ర-కూడేరు : మండల కేంద్రంలోని మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సోమవారం విద్యార్థులకు సంబంధించి 1వ తరగతి నుండి, 7వ తరగతి వరకు పాఠ్యపుస్తకాలు ప్రభుత్వం పంపిణీ చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి 2 సాయి కృష్ణ విలేకరులకు తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఈ విద్యా సంవత్సరానికి గాను 24 ..25 అకాడమిక్ సంవత్సరానికి ప్రభుత్వం మంజూరు చేసిన 8,877 ఉచిత పాఠ్యపుస్తకాలు కూడేరు మండలానికి చేరాయి. మండలానికి చేరిన పాఠ్యపుస్తకాలను మండల విద్యాశాఖ అధికారు2 సాయి కృష్ణ పరిశీలించి తరగతుల వారీగా విభజించి ఆయా పాఠశాలలకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసుకున్నారు, కార్యక్రమంలో మండల విద్యాశాఖ సిబ్బంది, రమణ, శివ ప్రసాద్, నాగలక్ష్మి, ఆదిలక్ష్మి, సురేంద్రబాబు, కుంటేన్న, పాల్గొన్నారు.

అనంతపురం జిల్లాలో కార్డెన్ సర్చ్

విశాలాంధ్ర-అనంతపురం : అనంతపురం ఎస్పీ గౌతమిశాలి ఆదేశాల మేరకు పోలీసులు బుధవారం జిల్లాలోని పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట, యల్లనూరు మండలం గొడ్డుమర్రి, గార్లదిన్నె మండలం సంజీవపురం, ఇటుకలపల్లి పోలీసుస్టేషన్ పరిధిలోని కందకూరు, గుమ్మఘట్ట మండలం భూపసముద్రం, గుంతకల్లు పట్టణంలోని ఉమామహేశ్వర్ నగర్, అనంతపురంలోని బిందెలకాలనీ, పామిడి పట్టణంలోని పలు సమస్యాత్మక కాలనీలలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు చేపట్టారు. సి.ఐ లు, ఎస్సైల ఆధ్వర్యంలో పోలీసులు పాత నేరస్తులు, ట్రబుల్ మాంగర్స్, రౌడీషీటర్ల మరియు కర్నాటక మద్యం, నాటు సారా, గుట్కా నియంత్రణ కోసం పాత కేసుల్లోని నిందితుల ఇళ్లల్లో మరియు పశువుల పాకలు, గడ్డి వాము ప్రాంతాలలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఈ ఆపరేషన్లలో ఇద్దర్ని అరెస్టు చేశారు. 30 లీటర్ల నాటు సారా మరియు రికార్డులు లేని 6 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం... గ్రామాలలో ఫుట్ పెట్రోలింగ్, గ్రామసభలు నిర్వహించి ఎన్నికల కౌంటింగు ప్రక్రియ... ఆ తర్వాత కూడి ప్రశాంతంగా జీవించాలని సూచనలు చేశారు. ఎలాంటి అల్లర్లకు వెళ్లకూడదని కోరారు. సమస్యలు సృష్టించినా, ప్రేరేపించినా కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని సూచించారు.

అయ్యగార్ల పల్లిలో కార్డెన్ సెర్చ్..

విశాలాంధ్ర-శెట్టూరు: అనంతపురం జిల్లా శెట్టూరు మండల పరిధిలో అయ్యగార్లపల్లి గ్రామంలో కళ్యాణదుర్గం పట్టణ సీఐ హరినాథ్, రూరల్ సీఐ చంద్రశేఖర్, ఆధ్వర్యంలో బుధవారం కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు చేపట్టారు. పోలీసులు పాత నేరస్తులు, ట్రబుల్ మాంగర్స్, రౌడీషీటర్ల మరియు కర్నాటక మద్యం, నాటు సారా, గుట్కా నియంత్రణ కోసం పాత కేసుల్లోని నిందితుల ఇళ్లల్లో, పశువుల పాకలు, గడ్డివాము ప్రాంతాలలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. అనుమానితుల వివరాలను లోతుగా చెక్ చేశారు. ఆయా గ్రామాలలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. అనంతరం... గ్రామసభలు నిర్వహించి ఎన్నికల కౌంటింగు ప్రక్రియ మరియు ఆ తర్వాత కూడి ప్రశాంతంగా జీవించాలని సూచనలు చేశారు. ఎలాంటి అల్లర్లకు వెళ్లకూడదని కోరారు. సమస్యలు సృష్టించినా, ప్రేరేపించినా కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

దేహదానం వీలునామా రాసిచ్చిన జీజీహెచ్ ఉద్యోగి

- అన్ని దానాల్లో కెల్లా దేహదానమే గొప్ప
- కొనియాడిన మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.మాణిక్యరావు

విశాలాంధ్ర-అనంతపురం: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో గత 35 సంవత్సరాలుగా ఎమ్ ఎన్ ఓ గా పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగి నాగరాజు తన మరణానంతరం తన దేహాన్ని ప్రభుత్వ వైద్య కళాశాలలోని అనాటమీ డిపార్ట్మెంట్ కు అందించే విధంగా దేహదాన వీలునామా పత్రాన్ని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ ఎస్ మాణిక్యరావు, అనాటమీ ప్రధాన విభాగాధిపతి ఆచార్య డాక్టర్ ఎస్ ఉమామహేశ్వరరావు ల సమక్షం లో అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ ఎస్ మాణిక్యరావు మాట్లాడుతూ అన్ని దానాలలోను దేహదానం చాలా చాలా గొప్పదని, దేహదానం ద్వారా వైద్య విద్యార్థులు వైద్య విద్యను బాగా నేర్చుకోవడానికి మానవ శరీర అంతర్నిర్మాణ శాస్త్రాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయడానికి, పరిశోధనలకు దేహదానం చాలా ఉపయోగపడుతుందని, తద్వారా మానవాళికి మంచి జరుగుతుందని తెలిపారు. దేహదాన కర్త నాగరాజు మాట్లాడుతూ... చనిపోయిన తర్వాత మన శవాన్ని కాల్చి బూడిద అయ్యే కంటే మన దేహం వైద్య విద్యార్థుల యొక్క విజ్ఞానానికి తోడ్పడితే అంతకంటే మంచి మేలు ఇంకేముందని, నా కుమారుడు డాక్టర్ విష్ణు కూడా ఇదే మెడికల్ కళాశాలలో 2010వ సంవత్సరం వైద్య విద్యార్థిగా చదువుకున్నాడని, ఎవరో ఒకరు దేహదానం చేస్తేనే వైద్య విద్యార్థులు మానవ అంతర్నిర్మాణ శాస్త్రాన్ని చదువుకోడానికి వీలవుతుందని అందుకే ఈ దానానికి నా అంగీకారాన్ని తెలిపాను అన్నారు. నాగరాజు చేసిన కార్యక్రమం ఎంతోమందికి స్ఫూర్తిదాయకమని అనాటమి హెచ్ ఓ డి ఆచార్య డాక్టర్ ఎస్ఉమామహేశ్వరరావు తెలిపారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పేథాలజీ ప్రధాన విభాగాధిపతి ఆచార్య డాక్టర్ శివశంకర నాయక్, సామాజిక వైద్యశాస్త్ర ప్రధాన విభాగాధిపతి ఆచార్య డాక్టర్ తెలుగు మధుసూదన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిలో పోలీసుల మాక్ డ్రిల్

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని ఆటోనగర్ సమీపంలో ఉన్న డిగ్రీ కళాశాల మైదానంలో బుధవారం డిఐజి షిమోషీ వాజ్ పేయి ఎస్పీ గౌతమి శాలి ఆధ్వర్యం లో మాక్ డ్రిల్ ప్రదర్శన చేశారు. ఈ మాక్ డ్రిల్ లో ఆర్మీ డు ఫోర్స్, సెంట్రల్ ఫోర్స్, లోకల్ పోలీసులు కలిసి తాడిపత్రి పట్టణంలో సార్వత్రిక ఎలక్షన్ సమయం లో వైసిపి, టిడిపి ఇరువర్గాలు తొమ్మిదో వార్డ్ ఓంశాంతి నగర్ పోలింగ్ బూత్ వద్ద రాళ్ల దాడి చేసుకున్నది. మరసటి రోజు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో టిడిపి, వైసిపి ఇరువర్గాలు ఒకరిపై ఒకరు రాళ్ల దాడి చేసుకోవడం ఈ సంఘటనలను పోలీస్ మాక్ డ్రిల్ చేసి, మీడియా ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పోలీసులు అశోక్ పిల్లర్ వద్ద నుండి బస్టాండ్ వరకు పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ జనార్ధన్ నాయుడు రూరల్ సీఐ లక్ష్మీకాంతరెడ్డి ఎస్సైలు గౌస్ బాషా, సాగర్ పాల్గొన్నారు.

యోగాసనా న్యాయ నిర్ణీతుల పోటీల్లో ప్రభుత్వ ఉపాధ్యాయుల ప్రతిభ

విశాలాంధ్ర-ఉరవకొండ : కేంద్ర ప్రభుత్వం ఆయుష్ క్యాబినెట్ అనుమతి పొందిన యోగ భారత్(యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) వారిచే నిర్వహించబడిన రాష్ట్రస్థాయి యోగాసనా పోటీలకు న్యాయ నిర్ణీతుల శిక్షణ పోటీల్లో ఉరవకొండ కి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు తాటికొండ వెంకట్, మంజునాథ్ అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి యోగాసన జడ్జిస్ గా ఎన్నికయ్యారు. ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు అనంతపురంలో నిర్వహించిన న్యాయ నిర్ణీతుల శిక్షణ పోటీల్లో వీరు పాల్గొన్నారు. ఎన్నికైన ఉపాధ్యాయులను యోగ భారత్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీమతి రాధిక అభినందనలు తెలుపుతూ బుధవారం ప్రతిభ పత్రాలను వారికి అందజేశారు.

పేదల ఆరోగ్యంతో చెలగాటం వద్దు

విశాలాంధ్ర-రాయదుర్గం : ప్రజల ఆరోగ్యంతో ప్రభుత్వాకి ఎంత నిర్లక్ష్యం ఆరోగ్యశ్రీ బిల్లులను వెంటనే చెల్లించి పేదల ప్రాణాలు కాపాడాలని ఆప్ జిల్లా కన్వీనర్ వెంకటరమణ బాబు డిమాండ్ చేశారు. దాదాపు 1500 కోట్లు నెట్ వర్క్ ఆసుపత్రులకు ప్రభుత్వము బకాయిలు ఉన్నాయని వాటిని చెల్లించాలని లేదంటే ఆరోగ్యశ్రీ సేవలు చేయబోమని ఆసుపత్రుల యజమాన్యం హెచ్చరించడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపధ్యంలో బుధవారము ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ దివంగత వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ఎంతో మక్కువతో తీసుకొచ్చిన ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రభుత్వ పెద్దలు నిర్వీర్యం చేయడం భాదకరం అని విచారణ వ్యక్తం చేశారు. గడిచిన సంవత్సరము కాలముగా ఆరోగ్యశ్రీ నెట్వర్కింగ్ హాస్పిటల్స్ రాష్ట్ర ప్రభుత్వానికి బకాయిలు చెల్లించకపోతే వైద్య సేవలు నిలిపేస్తామని పలుసార్లు హెచ్చరించిన ముఖ్య మంత్రి నుండి కనీస స్పందన లేకపోవడం పేదల ఆరోగ్యం పై ఉన్న చిత్తశుద్ధి తెలియజేస్తున్నదని ఆయన వ్యక్యానించారు. ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మారుస్తూ దాదాపు 1500 కోట్లు పెండింగ్ బిల్లులను ఆసుపత్రులకు చెల్లించకుండా పేదలకు వైద్యాన్ని దూరం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఏ ప్రభుత్వాలు వచ్చిన ప్రజా ఆరోగ్యం పట్ల దృష్టి సాదించాలని మండాలానికి ఒక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ఏర్పాటు చేసి మందులు వగైరా ఇబ్బంది లేకుండా ఢిల్లీలో ఆప్ ప్రభుత్వం పేద, మధ్య తరగతి వారికి అందిస్తున్నామని ఆయన తెలిపారు.

ఘనంగా మాసిక మహోత్సవం..

విశాలాంధ్ర-రాయదుర్గం అర్బన్: రాయదుర్గం మండల పరిధిలోని మల్లాపురం గ్రామంలో అంగన్వాడి సెంటర్ వన్ లో అంగన్వాడీ టీచర్లు చంద్రికళ, శోభారాణి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా మాసిక మహోత్సవం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిడిపిఓ ప్రభావతి, సూపర్వైజర్లు ఈశ్వరమ్మ, అంజనమ్మ లో పాల్గొన్నారు. అనంతరం సిడిపిఓ ప్రభావతి మాట్లాడుతూ కిషోర్ బాలికలు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పీరియడ్స్ సమయంలో కిశోర బాలికలు ఎలా ఉండాలో పలు సూచనలు సలహాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెల్పర్లు వసంతలక్ష్మి, మారెక్క కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో మొదటి స్థానం సాధించడం అభినందనీయం

విశాలాంధ్ర-రాప్తాడు: ఈనెల 13 నుండి 18 వరకు బెంగళూరు యూనివర్సిటీలో ఇంటర్ యూనివర్సిటీ సాఫ్ట్బాల్ మెన్ సాఫ్ట్ బాల్ పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచడంతో జట్టును బుధవారం ఎస్కే వీసీ హుస్సేన్ రెడ్డి క్రీడాకారులను అభినందించారు. స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ ఎంపీ శ్రీనివాసన్, సెక్రటరీ, కోచ్, ఏపీ సాఫ్ట్ బాల్ సీఈఓ సి.వెంకటేసులు, కార్యదర్శి సి.నాగేంద్ర సాఫ్టుబాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, నాగేంద్ర పాల్గొన్నారు. వీసీ మాట్లాడుతూ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన 46 ఏళ్ల తర్వాత ఎస్కేయూ జట్టు మొదటి స్థానం సాధించడం హర్షణీయమన్నారు. స్పోర్ట్స్ సెక్రటరీ శ్రీనివాసన్, కోచ్ వెంకటేష్ నేతృత్వంలో ఒక మంచి జట్టును ఎస్కే యూనివర్సిటీకి ఎంపిక చేసి కోచింగ్ క్యాంప్ నిర్వహించి ఈ గెలుపుకు దోహదపడ్డారని క్రీడాకారులందరూ చక్కగా తమ ప్రతిభను చూపించి ఎస్కేయూ కీర్తి ప్రతిష్టలను దేశంలో తెలిసేటట్లు చేశారని కొనియాడారు. యూనివర్సిటీలో క్రీడల అభివృద్ధికి శ్రీనివాసన్ ఎంతో కృషి చేస్తున్నా రని అన్నారు. ప్రభుత్వం క్రీడలలో రెండు శాతం రిజర్వేషన్ విద్య ఉద్యోగా లలో కల్పిస్తున్నదని దీనిని యువత చక్కగా ఉపయోగించుకొని క్రీడల పట్ల మక్కువ చూపి యువత క్రీడలలో దేశాన్ని అగ్ర పతాన నిలబెట్టాలని ఆకాంక్షించారు. క్రీడాకారులను అభినందించి గ్రూప్ ఫోటో తీసుకున్నారు.

ఉపాధి పనులపై ఏపీడీ సమీక్ష

విశాలాంధ్ర-శెట్టూరు : ఉపాధి హామీ పథకం కింద మండలానికి కేటాయించిన లక్ష్యాలు పూర్తిచేయాలని ఏపీడి రమేష్ నాయక్ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్ టెక్నికల్ అసిస్టెంట్ సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో ప్రతి గ్రామం నుంచి అధిక మొత్తంలో ఉపాధి కూలీలు పెంచే విధంగా ప్రతి గ్రామంలో అవగాహన కల్పించాలని తెలియజేశారు. డైలీలేబర్ ఈ మస్టర్,అమృత్ సరోవర్,మినీ అమృత్ సరోవర్ తదితర పనుల్లో కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా అన్ని గ్రామంలో పురోగతి సాధించాలని అన్నారు ఫారం పాండ్, డక్ అవుట్ పాండ్, ప్లాంటేషన్ వర్క్స్, అర్టికల్చర్ వాటిపైన ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఎక్కడైనా ఉపాధి పనులు కల్పించడం నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించాడు. ఎస్సీ ఎస్టీలకు ఉపాధి పనిలో కల్పనలో ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు సూచించారు. కార్యక్రమం లో ఎంపీడీవో నరసింహమూర్తి, ఏపీఓ నీరజ,ఈసీ వెంకటరమణ, టెక్నికల్ అసిస్టెంట్ నాగరాజు, ఈశ్వరమ్మ,రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కమనీయం.. లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం

విశాలాంధ్ర-రాయదుర్గంటౌన్: మండలంలోని మల్లాపురం గ్రామంలో వెలిసిన శ్రీ విష్ణమలై లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో బుధవారం లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు శ్రీరామ్మూర్తి స్వామీజీ, ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యం స్వామి, హరిప్రసాద్ భరద్వాజ్ ఆధ్వర్యంలో శ్రీ స్వామివారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, ఆకుల పూజ నిర్వహించారు. అనంతరం రిటైర్డ్ డీఈ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో 12 గంటలకు శ్రీవారి కళ్యాణం నిర్వహించారు...ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు బి.తిప్పేస్వామి, ఉపాధ్యక్షుల ధర్మన్న, కోశాధికారి నరసింహులు, ఉప కోశాధికారి ఎస్ ఆర్ఎస్ సత్యనారాయణ, కార్యదర్శి గురు రాఘవేంద్ర, ప్రసాద్ సభ్యులు గురునాథరెడ్డి, రామిరెడ్డి, వెంకట్ రెడ్డి, తిప్పేస్వామి, నరసింహులు పాల్గొన్నారు.

గుడిబండ మండలంలో పెట్రోల్ కొరత

విశాలాంధ్ర-గుడిబండ : ఇటీవల రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పలు హింసాత్మక ఘటనల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాలతో పెట్రోల్ బంక్ లలో వాహనాలకు తప్ప బాటిల్లకు పెట్రోల్ డీజిల్ పోయకూడదని నిబంధనలతో మండలంలో పెట్రోల్ డీజిల్ కొరత ఏర్పడింది మండలంలో ఎక్కడా కూడా పెట్రోల్ డీజిల్ బంక్ లు లేని సందర్భంలో దాదాపు 20 కిలోమీటర్ల దూరం నుండి పెట్రోల్ తీసుకువచ్చి చిన్న చిన్న దుకాణాలలో విక్రయించేవారు రాష్ట్రంలో జరిగిన కొన్ని సంఘటనల వల్ల ఇటీవల మండల పోలీసులు పెట్రోల్ డీజిల్‌ను విక్రయించకూడదని దుకాణాదారులకు నోటీసులు జారీ చేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెట్రోల్ అందుబాటులో లేని కారణంగా ఎక్కడబడితే అక్కడే వాహనాలు ఆగిపోతున్నాయి. వాహనదారులు ఎన్నికల ఫలితాలు ఎప్పుడు వస్తాయా దేవుడా అని చర్చించుకోవడం కనిపించడం గమనార్హం.

అసాంఘిక ఘటనలకు పాల్పడితే చర్యలు

విశాలాంధ్ర-యాడికి: ఏపీ ఎన్నికల అనంతరం ప్రస్తుతం తాడిపత్రిలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ప్రజల శాంతి భద్రతల దృష్ట్యా యాడికి మండల యు.పి.యస్ సిఐ నాగార్జున రెడ్డి పలు సూచనలు చేసారు. ఎన్నికల ఫలితాల వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘట నలు జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుం టున్నట్లు తెలిపారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున, ప్రజలు గుమికూడదని, బెట్టింగులకు పాల్పడ వద్దని హెచ్చరించారు. అదేవిధంగా సోషల్ మీడియాలోని వాట్సాప్,ఫేస్ బుక్,ఇంస్టాగ్రామ్ మరియు ట్విట్టర్ లలో కవ్వింపు చర్యలు లేదా రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టే వారిపై, ఆ పోస్టులను ఇతర గ్రూపుల్లో షేర్ చేసే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రూప్ అడ్మిన్లు బాధ్యులు కాకుండా జాగ్రత్తలు వహించాలన్నారు.

24న పాలీసెట్ వెబ్ కౌన్సిలింగ్‌పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-ఉరవకొండ: పాలిసెట్ 2024 సంవత్సరానికి సంబంధించి ఈనెల 24వ తేదీన ఉదయం ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వెబ్ కౌన్సిలింగ్ పై అవగాహన కల్పిస్తున్నట్లు ఉరవకొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఆశ్రప్ అలీ, కళాశాల ట్రిబుల్ ఈ శాఖధిపతి వై. సురేష్ బాబు, సివిల్ ఇంజనీరింగ్ శాఖ అధిపతి డాక్టర్ ఎన్.సులోచన, జనరల్ సెక్షన్ శాఖాధిపతి ఆలీహాప్ హుస్సేన్ తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ డిప్లమా కోర్సులో ప్రవేశాలకు సంబంధించి విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఈ కౌన్సిలింగ్ హాజరయ్యి ఆన్లైన్ రిజిస్ట్రేషన్, ఫీజు చెల్లింపు ప్రక్రియ, ధ్రువపత్రాల పరిశీలన విధానం, ఆప్షన్ల నమోదు, ఆప్షన్ల రద్దు, ఆప్షన్లో మార్పు, సీట్లు కేటాయింపు విధానం, సెల్ఫ్ జాయినింగ్ రిపోర్ట్ ప్రక్రియలకు సంబంధించి క్లుప్తంగా అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉచితంగానే తెలియజేస్తారని ఈ అవకాశాన్ని అనంతపురం జిల్లాలను విద్యార్థులు అందరూ కూడా హాజరై సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు.

వర్షం రాకతో రైతుల్లో హర్షం..

విశాలాంధ్ర-డి.హీరేహాళ్: మండలంలో మంగళవారం రాత్రి కురిసిన వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలో జాజరకల్లు, మడెనహాళ్లి, పులకుర్తి, మల్లికేతి, గొడిశెలపల్లి, హొసగుడ్డం తదితర గ్రామాల్లో భారీ వర్షం పడింది. గత కొంత కాలంగా వర్షం పడక రైతులు విలవిలాడుతున్న తరుణంలో ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో భారీగా వర్షం పడటంతో రైతుల్లో ఆందోత్సహం నెలకొంది. దీంతో వేరుశెనగ విత్తుకోవ డానికి రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు పలువురు రైతులు పేర్కొన్నారు. వరుణ దేవుడు ఇలాగే కరునిస్తే వేరుశెనగ పంట రైతుల కళ్లల్లో ఆనందం నింపుతుందని రైతులు తెలిపారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలన

విశాలాంధ్ర-ఉరవకొండ: పెన్నహొబిలం లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి ఈనెల 28వ తేదీన జరిగే బ్రహ్మ రథోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను బుధవారం అసిస్టెంట్ కలెక్టర్ బోల్లపల్లి వినూత్న పరిశీలించారు. బ్రహ్మోత్సవాలను ప్రశాంతంగా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు కూడా చేయాలని దేవదాయ శాఖ అధికారులకు ఆమె సలహాలు సూచనలు ఇచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని తెలిపారు అంతకు ముందు ఆమె లక్ష్మీ నరసింహ స్వామి దర్శించుకున్నారు ఆలయ కార్యనిర్వహణ అధికారి విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలలో ఒకరు డీబార్

విశాలాంధ్ర-జేఎన్టీయూపీ : శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ రెండవ సెమిస్టర్ బుధవారం జరిగిన పరీక్షలలో అనంతపురం ఎస్ ఎల్ ఎన్ డిగ్రీ కళాశాలలో కాపీయింగ్ కి పాల్పడిన ఒకరిని డిబార్ చేసినట్లు పరీక్షల విభాగాధిపతి ఆచార్య జి.వి రమణ తెలిపారు. పరీక్షలపై ఇష్టపడే చదివి జ్ఞాన సంపాదన సాధించి ఉత్తమ ఫలితాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు.

ప్రశాంత వాతావరణంలో మెలగండి

విశాలాంధ్ర - అగళి : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జూన్ 4న వెలువడనున్న ఫలితాలను గెలుపు ఓటములను సమానంగా తీసుకొని గ్రామాల్లో గొడవలు అల్లర్లకు తావు ఇవ్వకుండా ప్రశాంత వాతావరణంలో మెలగాలని ఎస్ఐ వీరేష్ సూచించారు. మండలంలోని వివిధ పార్టీల నాయకులను ఎస్ఐ స్టేషన్‌కు పిలిపించి దిశానిర్దేశం చేశారు. ఎన్నికలు జరిగాక కొన్ని ప్రాంతాల్లో గొడవలు ఘర్షణలు అల్లర్లు జరిగాయని, దీంతో ఎన్నికలు కమిషన్ ఉమ్మడి అనంతపురంలో 30 యాక్ట్ అమలు చేసిందని, జూన్ 6 వరకు ఈ నిబంధనలు వర్తిస్తాయన్నారు. అదేవిదంగా గ్రామాల్లో చిల్లర దుకాణం వద్ద పెట్రోల్ అమ్మకాలను జూన్ 6 వరకు జరపరాదని ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. మంగళ బుధవారాల్లో 28మందిని తహసీల్దార్ ఎదుట హాజరు పరచారు. ఎస్ వీరేష్ పాల్గొన్నారు.

జోరుగా బెట్టింగులు ...

విశాలాంధ్ర-గుడిబండ: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు పోలింగ్ ముగిసి దాదాపు దాదాపు పది రోజులు కావస్తుంది జూన్ 4న ఎన్నికల ఫలితాలు కూడా వెలువడనున్నాయి. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాలలో ఎన్డీఏ కూటమి గెలుస్తుందని అలాగే వైసిపి గెలుస్తుందని కొందరు లక్షల్లో బెట్టింగుకు పాల్పడుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం గతంలో ఎప్పుడు లేని విధంగా ఈసారి మడకశిర నియోజకవర్గంలో ప్రధాన పార్టీలతో పాటు కాంగ్రెస్ కూడా ఎన్నికల బరిలో ఎన్నికల బరిలో ఉండడంతో మడకశిర నియోజకవర్గ అభ్యర్థి గెలుపు పై సందిగ్ధత నెలకొనడంత బెట్టింగ్ రాయుళ్లు జోరుగా పందేలు కాస్తున్నట్లు సమాచారం ఈ క్రమంలో విజయం ఎవరిని వరిస్తుందో అని నియోజకవర్గ ప్రజలు ఎదురుచూస్తున్న తరుణంలో బెట్టింగులు జోరందుకోవడంతో ప్రజల్లో సర్వత్రా ఆసక్తి నెలకొంది. మరి గెలుపు ఎవరిని వివరిస్తుందో జూన్ 4వ తేదీ వరకు వేచి చూడాల్సిందే.

మాతృ శిశు మరణాలపై దృష్టి పెట్టాలి

విశాలాంధ్ర-పుట్టపర్తి: జన్మనిచ్చే తల్లి, జన్మించే బిడ్డ ప్రసవ సమయంలో మరణించకుండా వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మంజువాని వైద్య సిబ్బందికి సూచించారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య కేంద్రంలో మాతృ,శిశు మరణాలపై జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ నెలలో ఒక మాతృ మరణం ఎనిమిది శిశు మరణాలు జరిగినట్లు తేలింది. దుర్గా నగర్ లో ఒక మాతృ మరణం జరగగా ముదిగుబ్బ,వెంగళమ్మ చెరువు, కనగానపల్లి, ఇందిరానగర్ ,పేరూరు, కోడూరు, ఎనుములపల్లి పీహెచ్సీ యూపిహెచ్‌సిలలో 8 శిశు మరణాలు జరిగినట్లు సమీక్షలో వెల్లడింది. డిఎంహెచ్వో మాట్లాడుతూ ప్రతి బిడ్డ కాపాడు కోవాల్సిన బాధ్యత వైద్య ఇబ్బందిపై ఉందన్నారు. గర్భవతిగా ఉన్నప్పుడే వారికి తగిన జాగ్రత్తలు సూచించి ప్రసవ సమయంలో తల్లి బిడ్డ క్షేమంగా ఉండేవిధంగా సేవల అందించాల్సి ఉంటుందన్నారు. ఎక్కడ లోపం జరిగిందో పరిశీలించాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యాధి నిరోధక అధికారి డాక్టర్ నాగేంద్ర నాయక్, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ సేల్వియా సోలోమాన్, డాక్టర్ శ్రీలత, గైనకాలజిస్ట్ వీరమ్మ గాయత్రి బీహెచ్సీల వైద్యులు పాల్గొన్నారు.

ఘనంగా సత్య సాయి గిరి ప్రదర్శన

విశాలాంధ్ర-పుట్టపర్తి : పట్టణంలో సత్యసాయి గిరి ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి 7 గంటలకు పౌర్ణమి సందర్భంగా గణేష్ గేట్ నుంచి ప్రత్యేక రతంలో సత్యసాయి చిత్రపటాన్ని ఉంచి ఏడు కిలోమీటర్లు రతాన్ని లాగారు. సత్య సాయి భజనలు చేస్తూ స్థానికులతో పాటు విదేశీ భక్తులు పాల్గొన్నారు. గణేష్ గేట్ నుంచి గోకులం, ఎనుములపల్లి సర్కిల్, పెట్రోల్ బంక్, ఎద్దుల కొండ, పెద్ద కమ్మవారిపల్లి చింతతోపు మీదుగా తిరిగి రథాన్ని పుట్టపర్తికి తీసుకొచ్చారు. ప్రతి పౌర్ణమి ముందు రోజు ఈ గిరి ప్రదర్శన ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు.

ఇప్పేరులో వైభవంగా పెద్దమ్మ, మద్దమ్మల దేవర...

విశాలాంధ్ర-కూడేరు : మండల పరిధిలోని ఇప్పేరులో బుధవారం పెద్దమ్మ, మద్దమ్మల దేవరను గ్రామ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే గ్రామ దేవతలకు పందిరి పూజ, జలధి కార్య క్రమాలు నిర్వహించి అనంతరం దేవతల మొక్కులు తీర్చుకొన్నారు. ఈసందర్భంగా వర్షాలు సంవృద్ధిగా కురిచి పంటలు బాగా పండాలని ప్రజలు కోరుకున్నారు.